# గులాబీ పూసింది

"మన గులాబీ చెట్టుకి పువ్వు పూసింది" మృదువుగా నవ్వింది శిరీష.

"నిజంగా?" సంతోషంగా చూశాడు గోపాలకృష్ణ.

"ముందు టిఫెన్ కానివ్వండి. కాస్సేపలా చెట్లలో కూర్చుని వద్దాం."

గోపాలకృష్ణ ఆఫీసు బట్టలు మార్చు కొంటూంటే శిరీష ప్లేట్లు అమర్చింది టేబుల్ మీద.

శిరీష రోజులాగే అప్పటికే స్నానంచేసి తెల్లచీర కట్టుకుంది. భర్త కాఫీ పూర్తిచేసే వరకూ దగ్గిర కూర్చుని గులాబీ అందాలు వర్ణించింది. ఆరు నెలల కిందట శిరీష కొత్తగా అత్తవారింటికి వస్తూ ఆ గులాబి మొక్క తెచ్చింది. ప్రభుత్వం వారిచ్చిన క్వార్టర్స్‌లో తమకి చక్కని ఇల్లూ, చుట్టూ స్థలమూ వున్నాయని తెలిసి నప్పుడే హాయిగా ఊపిరి పీల్చుకుంది శిరీష.

పట్టణానికి దూరంగా కొండల ప్రాంతంలో ఆ ఇల్లూ, ఎటుచూసినా నిర్మానుష్యమైన స్థలాలూ, తమ పెరటిలో పెరిగిన పూలచెట్లూ .... వేరే స్వర్గం లేదని పిస్తుంది శిరీషకి.

పుట్టింటి నించి తెచ్చి పెంచిన గులాబీ మొట్ట మొదటి పువ్వు పూసింది. అంటీ అంటకుండా కొమ్మ ఒంచి పువ్వుని చూపింది — భర్తకి. మంచి ముత్యంలా, చిన్న పద్మంలా, నీరెండలో మిలమిలా మెరిసిందా తెల్లగులాబీ. చిన్న పిల్లలా అమాయకంగా చూసింది ప్రపంచంలోకి.

చటుక్కున రెమ్మమీదికి చెయ్యి పోనిచ్చాడు గోపాలకృష్ణ.

"ఆఁ, ఆఁ, వొద్దు, తెంచకండి, తెంచకండి" — కంగారుగా భర్త చెయ్యి పట్టుకుంది శిరీష. గోపాలకృష్ణ నవ్వాడు. "తెంచితల్లో పెట్టుకోకపోతే పూలమొక్కలు పెంచుకోటం ఎందుకూ?"

"ఊఁహూ! నా కోసం దాన్ని చెట్టునించి వేరు చెయ్యటం నా కిష్టంలేదు. ఆ పువ్వు అలా కొమ్మమీద ఊగుతూంటే చూడటానికి ఎంత హాయిగా వుంది! తెంచి జడలో పెట్టుకుంటే దాని జీవితం ఎన్ని క్షణాలు నిలుస్తుంది? అలాగే ఉండనివ్వండి. అలాగే తల్లినే అంటిపెట్టుకుని ఉండనివ్వండి!"

శిరీష ధోరణి గోపాలకృష్ణకి కొత్తగాదు. నవ్వుతూ అన్నాడు — "ఆ పువ్వు నీ జడలో వుంటేనేగానీ దాని అందచందాలు నాకు తెలీవు."

"జడలో పెట్టుకుంటే దాని అందం ఎంతసేపు వుంటుంది?"

"పోతే పోతుంది. అదే దాని సౌందర్యానికి సార్ధకత."

శిరీష నవ్వింది "వొద్దుబాబూ! ఆ పువ్వు మాత్రం తెంచకండి, నేను భరించలేను."

"ప్రతీదానికీ ఎందుకింత సున్నితంగా ఆలోచి స్తావు?"

గోపాలకృష్ణ చాలాసార్లు అలా అంటూ వుంటాడు కొంత విసుగ్గా. కొంత మృదువుగా.

ఆ మాత్రానికే శిరీష మొహం ఎర్రబారి కన్నుల్లో నీటిపొర పేరుకోబోతుంది.

"ఛ! ఇప్పుడు నేనేమన్నాను? ఊరుకో" అంటాడు మెత్తగా.

"సరేలే మొక్కకే ఉండనియ్యి!" అన్నాడు గోపాలకృష్ణ. శిరీష సంతోషంగా చూసింది.

★ ★ ★

మొర్రోమంటూ భయంకరంగా అరుస్తూ బొల్లి మచ్చల వూరకుక్క గేట్లోంచి పరిగెత్తుకు వచ్చి చెట్ల చాటున దూరింది. బయట ఒక్కసారిగా ఎన్నో కుక్కల ఏడుపులు వినవచ్చాయి. అత్తగారు పెద్ద దుడ్డు కర్ర పట్టుకుని చెట్టుమాటున నక్కిన వూర కుక్కని బలవంతంగా బయటికి గెంటి గేటు వేస్తోంటే గదిలో

చదువుకొంటూన్న శిరీష బయటికి వచ్చింది. ఇంటి ముందు దూరంగా ఏదో వాన్ బర్రుమంటూ వచ్చి ఆగింది. ఒక్కసారిగా కుక్కల అరుపులూ ఏడుపులూ లేచాయి.

"ఏమిటత్తయ్యా? ఏమిటా కుక్కలు?" శిరీష ఆతృతగా పరుగెత్తుకొచ్చింది గదిలో నించి.

"వాన్ వాళ్ళు వచ్చారని ఇలా ఇళ్ళ మీదికి ఎగ బడుతున్నాయి కుక్కలు. వాటి భయం వాటిదీ."

"భయమా? ఎందుకూ? వాళ్ళేం చేస్తారు?" ఆశ్చర్యపోతూ చూసింది శిరీష.

"అన్నిట్నీ పట్టుకుపోయి కాల్చి చంపుతారు. పీడాపోతుంది. మనుషులే బతకలేక చస్తోంటే, ఇక కుక్కలూ, నక్కలూ పెరిగిపోయి ఊరుమీద పడితే మనగతేంగాను?"

శిరీష గజగజ వణికిపోతూ చెవులు మూసేసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

వాన్ వెళ్ళిపోయింది.

కుక్కల ఏడుపులు ఇంకా శిరీష చెవుల్లో హృదయ విదారకంగా విన్పిస్తూనే వున్నాయి. చిన్నప్పుడెప్పుడో "పిచ్చికుక్క, పిచ్చికుక్క" అని అరుస్తూ పది మంది మనుషులు రోకళ్ళంతంత దుడ్డు కర్రలు పట్టుకుని ఒక కుక్క వెంటపడడం చూసింది. ఆ కర్రలు చిటికెల్లో దాని ప్రాణాలు తీసేశాయి. అప్పటినించీ ఆ దృశ్యం గుర్తొస్తే, మనసు కలిచి వేసినట్టయిపోతుంది. ఇప్పుడు ఒక్క కుక్క కాదు, ఇన్ని కుక్కల శోకాలు! ఎంత భయ పడిపోతున్నాయి అవి! చెవుల్లో ఆ ఏడుపులు ఇంకా వినిపిస్తూనే వున్నాయి.

శిరీష చెంపలు తడిసిపోతున్నాయి.

ఛీ! పల్లె లేదు, పట్నం లేదు. మనుషులకు ఎక్కడా జాలీ దయా లేవు. హృదయాలు లేని రాళ్ళు!

"అమ్మాయ్! అన్నానికి రారాదూ?" అత్తగారు మళ్ళీ మళ్ళీ పిల్చింది.

"అత్తయ్యా! మీరు తినెయ్యండి! నాకు ఒంట్లో బాగాలేదండీ. అన్నం తినలేను. నిద్రపోతాను కొంచెం సేపు."

ఇక ఎప్పటిదాకానో అన్నం మీదకి మనసు పోదు. ఆ కుక్కల బాధ! ఏడుపులు! అన్నం నోటికెలా పోతుంది?

★ ★ ★

"కాసిన్ని కూరలేమైనా కొందాం పద. అమ్మ చెప్పింది" అన్నాడు గోపాలకృష్ణ సాయంత్రం రాగానే శిరీషతో.

ఇద్దరూ బైల్దేరారు. ఆ బజారంతా చూస్తూంటే మతిపోయింది శిరీషకి. అసలే గతుకుల సందు. రెండు వేపులా సన్నని మురుగు కాలవలు. వాటిమీదే బల్లలూ, చెక్కలూ వేసి కూరగాయలు పరిచిపెట్టారు. కింద మురుగుల్లోంచి ఝుయ్‌మంటూ ఈగలు ఎగిరి వచ్చి కూరగాయల మీద వాలి కూర్చుంటున్నాయి. వాటిని తోలాలనే ఉద్దేశ్యం ఎవ్వరికీ వున్నట్టూ లేదు; తోలినా అవి వెళ్ళేటట్టూ లేవు. అప్పుడప్పుడూ పందులు లేచివచ్చి కూరగాయల గంపలకి ఒళ్ళు రుద్దుకుని ఏ దుంపో కాయో నోట కరుసుకుని పోతున్నాయి. వాటి ధ్యాసే ఎవరికీ వున్నట్టు లేదు.

కొనేవాళ్ళు కొనుక్కుంటున్నారు. అమ్మేవాళ్ళు అమ్ముతున్నారు. పెద్ద పెద్ద కంఠాలతో అరుస్తున్నారు. నానా గోలగా వుంది బజారు.

"వంకాయలు తీసుకుందామా?" అన్నాడు గోపాలకృష్ణ ఆ తట్టల వేపు చూస్తూ.

"ఈ వంకాయలా? ఇంటికా? ఛీ, ఛీ" అంది శిరీష.

"పోనీ తోటకూర తీసుకుందాం. లేతగా బాగానే వున్నట్టుంది" అన్నాడు ఇంకో తట్టవేపు చూస్తూ.

"ఈ తోటకూరా? ఇంటికా? ఛీ, ఛీ."

గోపాలకృష్ణ నవ్వాడు "భలేదానివి. అన్నీ వొద్దంటే ఇంకేం తింటాం?"

"ఏమో! ఇవి వొద్దు!"

"రోజూ కొనేవి ఇలాంటివేగా? సుబ్బరంగా కడుక్కుంటాం. తీసికెళ్ళకపోతే ఎలాగ?" అంటూ గబగబా ఒక వేపు వెళ్ళి కాసిన్ని వంకాయలు బుట్టలో వేయించుకుని తెచ్చాడు.

ఏడుపు మొహం పెట్టిన శిరీష తోటకూర తేనందుకు సంతోషించింది.

★ ★ ★

గోపాలకృష్ణ వాళ్ళ క్వార్టర్స్ టౌనుకి దూరం. టౌనుకి వెళ్ళాలంటే బస్సులో అరగంటకు పైగా ప్రయాణం.

శిరీష వచ్చి ఆర్నెల్లు దాటినా టౌనుకి వెళ్ళలేదు. గోపాలకృష్ణ ఎప్పుడు వెళ్దామన్నా "ఇప్పుడొద్దులెండి" అనేది. ఆర్నెల్లూ అలాగే గడిచాయి.

ఒక స్నేహితుడు పట్టుకున్నాడు గోపాల కృష్ణని భోజనాలకు రమ్మని. ఆ వంకతో శిరీషని బైల్దేరదీశాడు గోపాలకృష్ణ.

టౌనులో చాలా చోట్ల తిరిగారు. చాలా వీధులు చూశారు.

శిరీషకి ఏదీ నచ్చలేదు. ఆ అమ్మాయి ధన వంతుల పిల్ల కాకపోయినా, వాళ్ళ పల్లెటూళ్ళో నాలుగు గదుల ఇల్లూ, చుట్టూ పెరడూ వున్నాయి. ఈ టౌను వీధుల్లోంచి తిరుగుతోంటే, ఎటు చూసినా కిక్కిరిసిన ఇళ్ళే కనపడ్డాయి. కోళ్ళగూళ్ళల్లా .... గుమ్మాల ముందు మురుగు కాలవలు!

ఒకచోట రిక్షా ప్రయాణంకూడా ఆవేదనగానే తయారైంది శిరీషకి. ఎముకల గూడులాంటి రిక్షా తాతకి మోచేతి మడతల్లోంచీ, మెడమీదనుంచీ బొట్లు బొట్లుగా చెమట కారుతోంది. ఎత్తుమీద తొక్కలేక తాత కిందికి దిగి ఒగుర్చుకొంటూ శక్తంతా కూడగట్టు కుని రిక్షాని లాగుతూంటే శిరీషకి ముళ్ళమీద కూర్చు న్నట్టే అనిపించింది. "ఎత్తు దాటేవరకూ దిగి నడుద్దామా?" అంది భర్తకేసి చూస్తూ.

"వాడికి అర్ధ రూపాయి అర్పించుకోటం ఎందుకు మరి?" అన్నాడు గోపాలకృష్ణ విసుగ్గా.

శిరీష భయంగానే మళ్ళీ అంది. "పోనీ నడిచే పోదాం. పాపం తాత లాగలేకపోతున్నాడు. ఎంతో కొంత ఇచ్చి పంపిం చెయ్యండి!"

గోపాలకృష్ణకి శిరీష ధోరణికి చిరాకు వేసింది. "ఇది వాళ్ళకి అలవాటే శిరీషా! దిగిపోతామంటేనే వాడు గోలపెడతాడు. ఆ అర్ధరూపాయి సంపాదించు కుంటేనే ఒక పూటకి గంజి తాగుతాడు."

మరేమీ అనలేకపోయింది శిరీష. దిగులుగా కూర్చున్న శిరీష మొహం చూసి గోపాలకృష్ణ ఒక్కడూ దిగి కొంతదూరం నడిచాడు. చివరికి రిక్షా దిగినప్పుడే శిరీష ప్రాణం కుదుట పడింది.

స్నేహితుల ఇంట్లో భోజనాల కోసం పీటల దగ్గి రికి వెళ్తూ అక్కడ పదార్థాల్ని చూసి ఆశ్చర్యపోయింది శిరీష. విస్తర్లలో ఎన్ని కూరలో, ఎన్ని పచ్చళ్ళో! ప్లేటు నిండా గారెలు! పాయసం! కొంచెం దూరంగా అరిటి పళ్ళూ, యాపిల్ పళ్ళూ, అనాస ముక్కలూ, ఇంకా ఎన్నెన్నో!

శిరీష పీటమీద కూర్చుని, తన విస్తరిలోంచి అన్నీ పక్కగిన్నెల్లోకి తీసేసింది.

"అయ్యో! అయ్యో! అదేవిటమ్మా మరదలా? నీ నాజూకు తనమంతా మా ఇంట్లోనా? ఒక్కటీ వదల కుండా తినాల్సిందే" అంటూ గృహస్థురాలు గొడవ గొడవ చేసింది. తీసేసినవన్నీ మళ్ళీ విస్తరిలో పడేస్తూ దగ్గిరే కూర్చుంది. విసుగేసింది శిరీషకి. "ఇవన్నీ తినలేనండీ!" అంటూ సిగ్గుగా ప్రాధేయపడింది.

"అలా వీల్లేదు, ఎలా తినలేవో చూస్తాను. కొంచెం నెయ్యి వెయ్యనా? పుల్లటి ఆవకాయ వుంది. తింటావా? బొత్తిగా ఏమీ ముట్టుకోకుండా వున్నావు. నెల తప్పిందా ఏమిటమ్మా?" అంటూ ఆవిడ హాస్యాలు కూడ ప్రారంభించింది.

"ఎంత మంచి మనసో ఈవిడిది! తన చేతి భోజ నంతో ఎదటివాళ్ళ ఆకలి తీర్చాలని ఆరాటపడుతోంది" అనుకుంది శిరీష.

బైట నించి ఏదో కేక!

"అమ్మా! ముష్టి ముండని. పట్టెడన్నం పెట్టు తల్లీ!"

ఆ కేక శిరీష చెవుల్లో పడనే పడింది. తలెత్తి గృహిణికేసి చూసింది.

"ఏం మరదలా! ఏం కావాలి? ఇంకొక్క లడ్డూ వెయ్యమంటావా!" అంటూ ఆవిడ గుండ్రాళ్ళలాంటి రెండు లడ్డూలు చేతిలోకి తీసుకుంది.

"వొద్దండీ, నాకేం వొద్దండీ! కొంచెం మంచి నీళ్ళు...."

"అమ్మా! పసిబిడ్డ పాలులేక ఏడుస్తున్నాడు తల్లీ!" మళ్ళీ బైటినించి కేక!

"పోవే! పో! నీకేం వేళాపాళాలేదా? ఇంటివాళ్ళ

భోజనాలే అవలేదు, నీగోలేంటి మధ్య?" విసుక్కు న్నాడు ఇంటాయన.

"అలా నెమ్మదిగా అంటే అది కదులుతుందా? బైటికెళ్ళి పొమ్మని చెప్పండి!" అంది ఇంటావిడ భర్తతో.

"ధర్మ పెభువులు! పసిముండా కొడుక్కి ...."

"ఛీ! పొమ్మంటొంటే నీక్కాదూ?" విరుచుకు పడ్డాడు ఇంటాయన.

శిరీషకి పళ్ళెం ముందు కూర్చోబుద్ధి కాలేదు. ఇక ఏదీ నోట్లో పెట్టుకో బుద్ధి కాలేదు. తాపీగా అరటిపళ్ళు ఒల్చుకుని తింటోన్న భర్తకేసి చూసింది. అది గమ నించనే లేదతను. చటుక్కున నీళ్ళగ్లాసు అందుకుని లేచిపోయింది.

"అదేమిటి? అప్పుడే లేస్తున్నావూ? సేమ్యా పాయసం ముట్టుకోనే లేదే!" అంటూ విస్తుపోయింది గృహస్థురాలు.

"అబ్బే! ఇక నేను తినలేనండీ!" అనేసి శిరీష వాకిట్లోకి వెళ్ళి చెయ్యి కడుక్కుని వచ్చింది.

"పొమ్మని చెప్తూంటే నీక్కాదటే? వెళ్ళు, వెళ్ళు" అంటోంది హడావుడిగా తిరుగుతూ ఇంటావిడ.

బిచ్చగత్తె కదల్లేదు — "బిడ్డ మొహం చూసి గుప్పెడు ఎంగిలికూడు .... పడెయ్యండమ్మా!"

"ఆఁ, విస్తరేసి వడ్డిస్తాను కూర్చో! అడుక్కునే ముండలు కూడా పిల్లల్ని కని పారెయ్యటమే."

శిరీషకి అక్కణ్ణించి పారిపోదామనిపించింది. గారెల పళ్ళెం తీసుకుపోయి బిచ్చగత్తె గిన్నెలో ఒంపేద్దా మనిపించింది. ఏదీ చెయ్య లేకపోయింది. అన్ని పదా ర్థాలున్నాయి గుప్పెడు అన్నం పెట్టకూడదూ? ఇంటా విడ మీద అసహ్యం ముంచుకొచ్చింది. ఆ మనిషి చేతికూడు తిని లేచినందుకు తనమీద తనకే వెగటు కల్గింది.

బిచ్చగత్తె కంఠం మళ్ళీ విన్పించలేదు. నిట్టూ ర్చింది శిరీష.

"తమలపాకులు వేసుకోవూ అమ్మాయ్?" అంటూ వెండి ప్లేటులో ఆకులూ, వక్కపొడీ అన్నీ అమర్చుకుని గదిలోకి వచ్చిందావిడ.

"ఊహూ! నాకు అలవాటు లేదండీ!" అనేసింది శిరీష. శిరీషకి తమలపాకులు ఇష్టమే. గోపాల కృష్ణ శిరీష వేపు చూసి చూపులు తిప్పుకున్నాడు.

నెమ్మదిగా లేచి శిరీష కిటికీ దగ్గిరికి వెళ్ళి బయ టికి చూస్తూ నించుంది. పెరటి గోడమీదనించి దబ్బున వీధిలోకి పడ్డాయి విస్తళ్ళు. కుక్కలతోపాటు ఆ ముష్టి ఆమెకూడా ఎటునుంచో గాలిలా దూసుకువచ్చింది. ఎగబడుతోన్న కుక్కలతో పెనుగులాడి ఒక విస్తరి దక్కించుకుంది. మట్టిలోకి దొర్లిపోయిన గారె ముక్కల్నీ, పెంటమీద పొర్లాడుతూన్న మిఠాయి వుండ ముక్కల్నీ ఏరుకోగలిగింది. మీదమీదకి కరవొస్తున్న కుక్కల్ని అదిలిస్తూ పిల్లవాణ్ణి దించి పెంటకుప్ప పక్కనే కూర్చుని విస్తరి విప్పింది. ఎంగిలికూడూ, కూరలూ చిందర వందరగా ఆకంతా అలుక్కున్నాయి. గబగబా రెండు ముద్దలు మింగి ఒక ముద్ద పసి వాడి నోట కుక్కింది. వాడు కెవ్వుమన్నాడు.

శిరీష చటుక్కున తల తిప్పుకుంది. ఆ వేగంలో కళ్ళల్లో నిలచిన కన్నీటిబొట్లు రాలాయి. అలాంటి దృశ్యం ఆమె అంతవరకూ చూసి వుండలేదు. 'అన్నం పూర్తిగా విస్తరాకులో వదిలేసి లేచాను కాదే!' అన్న బాధ పీడించింది.

స్నేహితుల ఇంటినించీ బైటపడ్డారు.

ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు.

దారిలో ఒక గుడ్డి బిచ్చగాడు పోతూ కనిపించాడు.

శిరీష నడిరోడ్డు మీద నిలబడి పోయింది "అత నికి కొంచెం డబ్బులు ఇవ్వరాదూ?" అంది భర్తతో.

గోపాలకృష్ణ విసుక్కున్నాడు. "చాల్లే! నీకొక్కదానికే హృదయం వున్నట్టు ప్రవర్తిస్తావు. ఇలా దారిపొడుగునా దానధర్మాలు చేసుకుంటూ పోతే కొన్నాళ్ళకి మనం కూడా వాళ్ళలాగే అవుతాం. రా, తొందరగా" అంటూ కిళ్ళీకొట్టు కేసి నడిచాడు.

"నీకేమైనా కావాలా?"

"ఊహూ! ఏం వద్దు."

"కిళ్ళీ వేసుకోవా? వాళ్ళింట్లో వేసుకో లేదుగా?"

"ఇప్పుడేం వద్దు."

"పోనీ, షోడా తాగుతావా?"

"అబ్బ, నాకేం వద్దులెండి."

గోపాలకృష్ణ మారుమాట్లాడకుండా వెళ్ళి గుడ్డివాడి చేతిలో రెండు పైసలు వేసివచ్చాడు. "గుడ్డివాడికైతే

తప్పకుండా డబ్బులు రాల్తాయని ఎన్నివేషాలన్నా వేస్తారు. ఒక్కొక్కళ్ళు నిజంగానే వున్న కళ్ళు పోగొట్టు కుంటారు" అన్నాడు.

శిరీష ఒళ్ళు జలదరించింది. భీతిగా చూసింది.

"నిజం శిరీషా! ఈ నికృష్టపు వెధవలు పిల్లలు పుట్టగానే జిల్లేడుపాలు పోసి కళ్ళు పోగొడతారంట! నువ్వెప్పుడూ వినలేదా?"

"ఛీ! ఊరుకోండి!" శిరీషకి తలగిర్రున తిరిగి నట్టయింది.

గోపాలకృష్ణ రిక్షా బేరంలో పడ్డాడు.

"అరణాలిప్పించండి బాబూ! కడదాకా ఎత్తు! లాక్కుపోవాలి" అంటున్నాడు రిక్షా అతను.

"ఆ బేడా తగ్గించేశావేం? అర్ధరూపాయి అడగక పోయావ్?" వెటకారం చేశాడు గోపాలకృష్ణ.

"తవరికి తెలవదా బాబూ?"

"అదేం కదరదు. పావలా ఇస్తాను, వస్తావా?"

"ఇంకొక్క అణా డబ్బులు ...."

"వెళ్ళవయ్యా, వెళ్ళు. ఈ ఊరి బేరాలు నాకు తెలీనట్టు చెప్తావేంటి?"

శిరీష వుండబట్టలేకపోయింది. "పాపం, పోనీ ఒక్క అణా ...."

ఎర్రగా చూచాడు గోపాలకృష్ణ. చటుక్కున తల దించేసుకుంది. ఇంకో రిక్షాని పిలిస్తే పావలాకి బేరం కుదిరింది.

మొదటి రిక్షా అతను కాళ్ళీడ్చుకుంటూ కిళ్ళీకొట్టు దగ్గిరి కెళ్ళాడు, కొట్టు అతను పెద్ద గొంతుతో అరుస్తు న్నాడు. "ఇప్పటికే నువ్వు ఏడణాలు బాకీ, ఇంకా నీకు అరువెవఁడా యిస్తాడు? చాల్లే, వెళ్ళు!" అన్నాడు.

రిక్షా అతను వెనక్కి వచ్చాడు. "బాబూ, వస్తాను రండి" అన్నాడు.

గోపాలకృష్ణ వెట కారంగా నవ్వి. "నువ్వు వూరికే వస్తానన్నా రానుగాని వెళ్ళవయ్యా!" అంటూ సిగరెట్ దూరంగా విసిరి రెండో రిక్షా ఎక్కాడు.

శిరీష కడుపు తరుక్కుపోయింది. కళ్ళు చెమర్చి నంత పని అయింది.

వెనక్కి తిరిగి చూసింది. తమ వెనకే అతని ఖాళీ రిక్షా వస్తోంది. అతని కేం బేరం కుదిరినట్టు లేదు. అతనికో అణా ఇస్తే బాగుండుననిపించింది. రెండు నిముషా లాగి నెమ్మదిగా ఎడంచేతిలోకి ఒక నాణెం తీసుకుంది. ఆ చెయ్యి రిక్షా వెనక్కి పెట్టి రెండు రిక్షాల మధ్యా ఎవరూలేని క్షణం చూసి చేతిలో నాణెం జార విడిచింది.

"ఏం. అంత మౌనంగా కూర్చున్నావు?"

"ఊహూ, ఏం లేదు"

"లేకపోవటం ఏమిటి? ఏదో ఆలోచిస్తున్నావు."

"నాకేం ఆలోచన?" నెమ్మదిగా నవ్వింది.

"నిన్ను బయటికి తీసుకురావటం అంటే భయంగా వుంది."

" .... బైటికిరావడం అంటే నాకూ భయంగానే వుంది."

"దేన్ని చూసినా ఆలోచిస్తూ, బాధ పడుతూ కూర్చుంటావు. ప్రతిదానికీ ఇలా మనసు పాడుచేసు కుంటే ఇక బయటికొచ్చి తిరగ్గలమా?"

ఇంటికివెళ్ళి భోజనాలు ముగించి పక్క మీదకు చేరాక నెమ్మదిగా అంది. "ఇందాక ఆ రిక్షా అతన్ని చూస్తే నాకు చాలా జాలేసింది. ఒక అణాతీసి రిక్షా వెనకాల పడేశాను."

"వాడు తీసుకోకపోతే?"

"ఎందుకు తీసుకోడూ? ఆ మాత్రం కనపడదా?"

"కనపడలేదనుకో."

మాట్లాడలేదు శిరీష.

"అయినా శిరీషా! ఇలా ఎంతమందిని ఉద్ధరించ గలవు?"

"ఇందులో ఉద్ధరించటం ఏముంది? ఏదో మనం చెయ్యగల సాయం ...."

"దానివల్ల ఏం లాభం? చెయ్యి చాచగానే గుప్పిటి నిండా డబ్బులు దొరుకుతోంటే కష్టపడటానికెవ్వడూ ఇష్టపడడు. దేశంలో వేలకొద్దీ ముష్టివాళ్ళు పెరుగు తారు. వాళ్ళందర్నీ, కష్టపడి సంపాదించుకుంటూన్న వాళ్ళే పోషించాల్సి వస్తుంది. ప్రతీ ఒక్కడూ కష్టించి పనిచేస్తే ఎలా వుంటుందో, దేశం ఎంత అభివృద్ధి అవుతుందో ఆలోచించు!"

"కాని కుంటివాళ్ళూ గుడ్డివాళ్ళూ ఏం చెయ్య గలరు?"

"వాళ్ళంతా నిజమైన కుంటివాళ్ళూ, గుడ్డివాళ్ళూ అనుకుంటున్నావా? నీకో సంగతి చెప్పనా? కాలేజీ రోజుల్లో ఒకసారి కొండలవేపుకి పిక్నిక్‌కి వెళ్ళాం. ఆ కొండలకి దగ్గర్లోనే ఏదో గుడి వుంది. ఆరోజు ఏదో ఉత్సవంకూడా. గుడి మెట్ల పొడుగునా ముష్టివాళ్ళు కూర్చున్నారు. కుంటివాళ్ళూ, గుడ్డివాళ్ళూ, చేతులు లేనివాళ్ళూ, బుర్రలు లేని వాళ్ళూ, ముసిలివాళ్ళూ, పడుచు వాళ్ళూ, బోలెడుమంది. కాని వాళ్ళందర్లో నిజంగా అడుక్కు తినాల్సిన వాళ్ళు పది మంది కూడా వుండరేమో! మాలో ఒక ఫ్రెండు, ఓ చెయ్యి విరిగిన వాణ్ణి దగ్గరికి పిల్చాడు. వాడితోపాటు మమ్మల్నందర్నీ దూరంగా చెట్లచాటుకి తీసుకువెళ్ళాడు. అక్కడేం జరిగిందో తెలుసా? ఊహించు చూద్దాం."

"అబ్బ, చెప్తురూ? ఏమైంది? చెయ్యి విరిగిన సంఘటనంతా అతను మీకు చెప్పాడా?"

నవ్వాడు గోపాలకృష్ణ, "విను మరీ. పైన బిగించి కట్టిన తొడుగులన్నీ ఊడదీసి నిక్షేపంలాంటి స్వంత చేతిని చూపించాడు."

"ఏమిటి? అతని చెయ్యి విరగనేలేదా!"

"లక్షణంగా వుంది చెయ్యి! గిరగిరా తిప్పికూడా చూపించాడు. నమ్ముతావా?"

నమ్మనట్టు అంది శిరీష — "తన రహస్యం చెప్పేస్తాడా ఎక్కడైనా?"

"రెండు రూపాయిలిస్తామంటే ఒప్పుకున్నాడు. నిజం తెలుసుకోవాలనే సరదా కొద్దీ అలా చేశాడు మా ఫ్రెండు."

శిరీష మాట్లాడలేకపోయింది.

అతను అన్నాడు — "అందరూ మోసగాళ్ళే అననుగానీ, కష్ట పడకుండా సంపాదించాలనే గదా ఇలాంటి మోసాలకు ఒడిగడుతున్నారు?"

"కానీ .... నిజంగా కుంటివాళ్ళూ, గుడ్డివాళ్ళూ వుంటారుగా? వాళ్ళకైనా సాయం చెయ్యొద్దా?"

"అవసరం లేదు శిరీషా! ఆ బాధ్యత ప్రభుత్వానిది. నువ్వూ నేనూ ఇలా వ్యక్తి గతంగా ఎంత దయ చూపించినా ప్రయోజనం వుండదు. దేశంలో ప్రతీ ఒక్కడికీ పని చూపించాల్సిన అవసరం పాలకులదే, కష్టించి పనిచెయ్యాల్సిన కర్తవ్యం ప్రజల దీనూ. వరసగా రెండు రోజులు కడుపు కాలితే ఏ ముష్టి వాడైనా పనికోసం పాకులాడతాడు. కుంటి వాళ్ళు కూడా చేతులతో చేసే పనులు చెయ్యవచ్చు. గుడ్డి వాళ్ళు కూడా చదవనూ రాయనూ నేర్చుకోవచ్చు. ఆ అవకాశాలు ప్రభుత్వమే కల్పించాలి."

ఆమెకేం మాట్లాడాలో తెలీలేదు. గోపాలకృష్ణ చెప్పిందంతా నిజమేననిపించింది. తనకి పిచ్చి ఆవేశం తప్పితే వివేకం లేదు. అసలు లోకజ్ఞానం తనకేం వుందనీ?

గోపాలకృష్ణ నెమ్మదిగా అన్నాడు. "జీవితం సమస్యల తోరణం శిరీషా! హృదయమంతా కరుణా, సానుభూతీ, ఆర్ద్రతా నింపుకోవచ్చు. కానీ, అవన్నీ హద్దులు మీరి ప్రవహిస్తే నిత్యజీవితంలో రకరకాల సమస్యలతో బతకగలిగేది ఎలా? మానవత్వం లేకుండా రాక్షసుల్లా స్వార్థపరులై బతకాలనటం లేదు. కానీ ఎంత ఘోరమైన దృశ్యం చూసినా, ఎంత విషాద వార్త విన్నా, మతి పోగొట్టుకోకూడని ఆత్మ స్థైర్యం ముఖ్యం."

శిరీష కేమీ మాట్లాడాలనిపించలేదు. అతను మాట్లాడిన కొద్దీ వినాలనిపించింది. తనకు అతను కొత్త కొత్త సంగతులు చెప్పి లోకానుభవం కల్గిస్తున్నట్టూ, తనలోని బలహీనతల్ని దూరం చేస్తున్నట్టూ అన్పించింది. అలా వింటూనే నిద్రలోకి ఒరిగిపోయింది.

★ ★ ★

ఇద్దరూ తోటలో మొక్కల్ని చూసుకుంటూ తిరిగారు చాలాసేపు.

గులాబీ చెట్టుకి ఆ పువ్వు ఇంకా ఉంది.

"ఇంట్లో అత్తయ్య ఒక్కరే వుంటారు. పదండి వెళ్దాం" అంటూ లేచింది శిరీష. తిన్నగా గులాబీమొక్క దగ్గిరికి నడిచింది. చీకట్లోకూడా చిన్ని నక్షత్రంలా మెరుస్తోందా తెల్లగులాబీ. చటుక్కున కొమ్మవంచి ముని వేళ్ళతో పువ్వుని తెంచింది.

"అదేమిటి, పువ్వు కోశావ్!" విస్తు పోతోన్న భర్తకా

పువ్వు అందిస్తూ నవ్వుతూ అంది. "నా జడలో వుంటే చూడాలని మీరేగా అన్నారు?"

పువ్వు అందుకున్నాడు గోపాలకృష్ణ. "మొన్న కొయ్యడానికి నువ్వు ఒప్పుకో లేదుగా?"

"ఇప్పుడు ఒప్పుకున్నానుగా! తల్లి మొక్క సంతోషమూ తీరింది. ఇప్పుడు మన ముచ్చటా తీరుతుంది." పువ్వుని తన జడలో అలంకరించమంటూ వెనక్కి తిరిగి నిలబడింది.

గోపాలకృష్ణ గులాబీని శిరీష జడలో సర్దాడు. ఆమె భుజాలచుట్టూ చేతులువేశాడు. "శిరీ! పువ్వు పూసింది చెట్టునుండటానికి కాదు. నీ సిగలోకే. నువ్వు పుట్టింది దేనికో తెలుసా? నా కౌగిట్లోకి!"

శిరీష సిగ్గుపడిపోయింది. "ఇదే నా జన్మకి సార్ధకత" అందామనుకుంటూనే మూగగా అతని గుండెల్లో మొహం దాచుకొంది.

"శిరీ! నువ్వెంత సున్నితమైన దానివి!"

["హాపీన్యూస్" మాసపత్రికలో. 1960 కన్నా ముందు అయి వుంటుంది] ★

**ఈ కథ గురించి:**

దీన్ని రాసినప్పుడు, ఇది 21 పేజీల కథ. ఇప్పుడు బాగా తగ్గించాను. అనవసరపు వర్ణనలూ, పొరపాటు భావాల సంభాషణలూ గతంలో చాలా వున్నాయి. తీసివేసినవన్నీ అలాంటివే. అసలు కథా వస్తువునీ, పాత్రల్నీ అర్థం చేసుకోవడానికి వీలయ్యే భాగాల్నే ఇప్పుడు ఉంచాను. ఈ ఉంచిన పేరాల్లో కూడా అక్కడక్కడా క్లుప్తం చేశాను.

ఈ కథని అసలు రీప్రింటునించీ వదిలివెయ్యవచ్చు. కానీ, శిరీష పాత్రలో చివరికి ఎలాంటి లోపం జరిగిందో చెప్పాలంటే, ఈ కథని ఉంచాలి. అందుకే దీన్ని తగ్గించేసి ఉంచాను.

ఈ కథా వస్తువు ప్రకారం శిరీష మంచి అమ్మాయి. జాలి గుండెగల మనిషి. తోటి మనుషుల బాధలకు కళ్ళ నీళ్ళు పెట్టుకుంటుంది. మనుషుల బాధలకే కాదు, జంతువుల బాధలకు కూడా తల్లడిల్లుతుంది. అలాంటి మంచి మనిషి, చివరికి ఎలా మారింది? ఎదటి వాళ్ళ కష్టం చూసి ఏదో కాస్త జాలిపడవచ్చుగానీ, మరీ ఎక్కువ బాధ పడక్కర్లేదు — అనుకునేటట్టుగా మారింది!

ఆ గొప్ప జ్ఞానాన్ని భర్తగారినించి నేర్చుకుంది. తనకు లోక జ్ఞానం కూడాలేదనీ, భర్త చాలా జ్ఞానవంతుడనీ నమ్మేవిధంగా మారింది.

ఆ భర్త ఎలాంటివాడు? — భర్తలందరి లాంటివాడే. తన భార్యకన్నా తను గొప్ప మేధావినని భావించే రకం వాడు! పేదసాదల్ని ఈసడించే రకంవాడు! నిరు పేద రిక్షా మనిషితో కూడా బేరాలాడే రకం వాడు! పువ్వులు ఆడవాళ్ళ సిగలకోసం, ఆడవాళ్ళు మొగవాళ్ళ కౌగిళ్ళకోసం పుడతారని భావించే రకం వాడు! అలాంటి భర్తే, శిరీషకు జ్ఞాన బోధకుడయ్యాడు!

ఆ జ్ఞాన బోధతో శిరీష చాలా మారింది. పూలని తల్లిమొక్కనించి విడదియ్యకూడదు — అనుకునే శిరీష, తన చేతుల్తో తనే పూలని కొయ్యగలిగే విధంగా మారింది. ఇక ఈ శిరీష, తర్వాత రోజుల్లో తన జాలిగుణాన్నంతా నాశనం చేసుకునే విధంగా మారదా? తప్పకుండా అలాగే మారుతుంది.

చెట్లనించి కాయలూ పళ్ళూ, ఆకులూ అలములూ, అన్నీ తెంపుతాం. ఆహారం కోసమూ, వైద్యం కోసమూ అదంతా అవసరం. భార్యాభర్తల పడకటింట్లో పూల పరిమళాలు వుండడం కూడా మంచి అవసరమే. కానీ, ఆడవాళ్ళు, ఎక్కడ తిరిగితే అక్కడ, బైట పని స్థలాల్లో కూడా, 'తల నిండా పూదండలు దాల్చి' తిరగడానికి పూలని వాడితే, అది పనికి మాలిన పని.

ఈ కథలో, పూలని వాడే ప్రసక్తి భార్యా భర్తల మధ్యనే వచ్చింది. అయినప్పటికీ, పూలని చెట్టునే వుంచడం అజ్ఞానమనీ, వాటిని స్త్రీలు తలల్లో పెట్టుకోవడమే జ్ఞానమనీ చెప్పినట్టుగా చివరికి అర్థం వచ్చింది. చెప్పే విషయం సరిగా లేకపోతే, అది అపార్థాలకే దారి తీస్తుంది.

"బిచ్చగాళ్ళకి పనులు చూపించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. వాళ్ళని చూసి మనం జాలి పడక్కరలేదు" అనే పద్ధతిలో భర్తగారూ చెప్పాడు కదా? ఆ మాటలు శిరీషకి బాగా నచ్చాయి. ఆ మాటల మీద సందేహాలు వచ్చే తెలివి శిరీషకు లేదు.

"ఇప్పుడు ప్రభుత్వం వుంది కదా? ప్రభుత్వం ఎంత కాలంనించో కూడా వుందికదా? మరి, అది, బిచ్చగాళ్ళకి పనులు ఎందుకు చూపించడం లేదు? ఇప్పటి వరకూ చెయ్యని ఆ పని ప్రభుత్వం తర్వాత ఎప్పుడు చేస్తుంది? ఎందుకు చేస్తుంది?" — ఇలాంటి ప్రశ్నలేవీ శిరీషకి రాలేదు. ఆమె ఆ ప్రశ్నలు అడిగితే, భర్త, ఏమీ చెప్పగలిగేవాడు కాడు. ఎందుకంటే, అతనికీ ఏమీ తెలీదు.

ఈ ప్రభుత్వం దోపిడీదారుల ప్రభుత్వమనీ, ఇలాంటి సమాజంలో పేదతనమూ, నిరుద్యోగమూ తప్పనిసరి లక్షణాలనీ, వీటికోసం ఈ ప్రభుత్వం ఎప్పటికీ ఏమీ చెయ్యదనీ, దోపిడీ అనేది ఉన్నంతకాలం నిరు పేదలు బిచ్చమెత్తుకుంటూ బతికే విధానం ఇలాగే వుండక తప్పదనీ — ఈ విషయాలేవీ గోపాలక్రిష్ణకు తెలీవు.

శిరీష, అతన్ని "ప్రభుత్వం, అందరికీ పనులు ఎప్పుడు చూపిస్తుంది?" అని అడిగివుంటే, అతను ఏం చెపుతాడు? "చూపిస్తుంది. చూపించదా? చూపించాలి" అంటాడేగానీ, "అవునుకదా? ఇంతకాలమూ చెయ్యని పని ప్రభుత్వం ఇంకెప్పుడు చేస్తుంది? ఎందుకు చేస్తుంది?" అని ఆలోచించడు. అలా ఆలోచిస్తే, తను శిరీషకి చెప్పిందంతా తప్పనే అర్థం వస్తుంది కాబట్టి అలా ఆలోచించడు.

శిరీషకి ఆ ప్రశ్నలు రాలేదు కాబట్టే కథ అలా ముగిసింది.

"బిచ్చగాళ్ళ వ్యవహారం అంతా ప్రభుత్వం బాధ్యత! మనం జాలి పడక్కర లేదు!" అని భర్తగారినించీ నేర్చుకున్న శిరీష, ఇక తర్వాత కాలంలో బిచ్చగాళ్ళ విషయంలో ఎలా వుండవచ్చు? ఎవరైనా బిచ్చగత్తె ఇంటిముందు నిలబడి అరిస్తే, శిరీష పూర్వంలాగ జాలిపడకుండా "చెయ్యి ఖాళీ లేదు, వెళ్ళు" అంటుందేమో! "చెప్తే నీక్కాదూ? ఎన్నిసార్లు చెప్పాలి?" అని విసుక్కుంటుందా? ఆ మార్పు ఎలా వుంటుందో గానీ, ఆమె జాలిగుండె ఆమెకి వుండదు. అది గట్టిపడిపోతుంది.

కథలో చివవ, 'భర్త మాటలకు శిరీష' ఎలా మారిందో చూడండి! ఎంత మంచి మనసు ఎంత చెడిపోయిందో చూడండి!' అనే అర్థం వచ్చేలాగ వుండి వుంటే, అప్పుడు ఆ కథ మంచి కథ అయ్యేది. కానీ, కథ అలా లేదు. శిరీష మారిపోవడంతో, ఆమె వివేక వంతురాలు అయినట్టు కథ ముగిసింది. అదీ కథలో తప్పు!

ఈ తప్పు ఎందుకు జరిగిందంటే — రాసిన మనిషికి సమాజంలో అసలు నిజాలు తెలియక. పుట్టినప్పటినించీ నేర్చుకున్నదంతా తప్పుడు జ్ఞానమే. అసలు నిజం వేరే వుంది. అది తెలియకుండా మాట్లాడితే, అది తెలియకుండా కథలు రాస్తే, అందులోకి తప్పులుగాక ఏం వస్తాయి? అందుకే ఎంతెంత గొప్పగొప్ప రచయితలు చూపించే పరిష్కారాలైనా కూడా తప్పుతప్పులుగానే వుంటాయి. ఆ తప్పు లేమిటో తెలుసుకుంటే, అది కూడా జ్ఞానమే. ఇలాంటి కథలు అందుకైనా ఉపయోగపడాలి.

6-6-2004